నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: భూపతిరావునగర్, చంద్రపురం కాలనీ ఫీడర్ల మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ సికింద్రాబాద్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9.30గంటల నుంచి 12.30గంటల వరకు భూపతిరావు నగర్, శక్తి గణేష్ నగర్, అల్వాల్ హిల్స్.... మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు చంద్రపురం కాలనీ, మంగాపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

బల్కంపేట ఎల్లమ్మకు ప్రత్యేక అలంకరణ



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వీఐపీ, బోనాల కాంప్లెక్స్‌లు కిటకిటలాడాయి. దాతల సహకారంతో అమ్మవారిని వివిధ రకాల పండ్లు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రాజ్



అమీర్‌పేట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సనత్‌నగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు డి.డి. వెంకట్‌రాజ్ నియమితులయ్యారు. మంగళవారం ప్రకటించిన జంబో కమిటీలో వెంకట్‌రాజ్‌కు స్థానం కల్పించారు. 1984 నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ విభాగంలో వివిధ పదవులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: టీయూసీఐ తెలంగాణ రాష్ట్ర ప్రథమ మహాసభలను ఈనెల 21, 22వ తేదీలలో నిజామాబాద్‌లో నిర్వహించనున్నట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల అధ్యక్షురాలు ఎస్‌ఎల్ పద్మ పేర్కొన్నారు. మంగళవారం ఓయూలో టీయూసీఐ అనుబంధ ప్రొగ్రెసివ్ కాంట్రాక్టు అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మహాసభల సందర్భంగా 21న జరిగే ఎబహిరంగ సభకు టీయూసీఐ అఖిల భారత అధ్యక్షులు అమిష్ పటేల్ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ప్రతినిధుల సభను మాజీ విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

సికింద్రాబాద్: బౌద్ధనగర్‌లో బీజేపీ నాయకులు మంగళవారం పర్యావరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించిన అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ, భావితరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించడం కోసం పౌరులు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

గాంధీఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం



భిక్షపతి

గాంధీఆస్పత్రి: వైద్యం కోసం వచ్చిన రోగి అదృశ్యమైన ఘటన గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మహబూబ్‌నగర్ పాలకుండ తండాకు చెందిన భిక్షపతి (63) గుండె సంబంధ రుగ్మతలతో బాధపడుతున్నాడు. దిల్‌సుఖ్‌నగర్ కొత్తపేటలో ఉంటున్న కుమార్తె వద్దకు రాగా, ఆమె ఈనెల 6న గాంధీ అత్యవసర విభాగంలో చేర్పించింది. వైద్యసేవలు పొందుతున్న భిక్షపతి అదే రోజు ఎవరికీ చెప్పకుండా అత్యవసర విభాగం నుంచి బయటకు వెళ్లిపోయాడు. పరిసర ప్రాంతాలతో పాటు స్వగ్రామంలో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కుమార్తె దుర్గా మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

ఫోన్ లాక్కొని పరార్.. కేసు నమోదు

సనత్‌నగర్: ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ చేతిలోని ఫోన్‌ను బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు లాక్కొని పరారైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..బోరబండ వి.రామారావునగర్‌కు చెందిన సారిపల్లి లావణ్య పూలను విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటుంది. ఈ నెల 4న ఉదయం 10.15 గంటలకు మోతీనగర్ వద్ద బస్సు దిగి ఫోన్‌లో మాట్లాడుతూ తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి చేతిలోని ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు బాధితురాలు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి శుద్ధి ఎక్కడ?

- నియంత్రణ లేని నీటి వ్యాపారాలు
- శుద్ధి చేయకుండానే విక్రయాలు
- ఎక్కడపడితే అక్కడ వెలుస్తున్న వాటర్ ప్లాంట్లు
- అడుగంటుతున్న భూగర్భజలాలు
- సికింద్రాబాద్‌లో పర్యవేక్షణ కరువు



సికింద్రాబాద్ ప్రాంతంలో వెలసిన ఓ వాటర్ ప్లాంటు

సికింద్రాబాద్: సికింద్రాబాద్‌లో నీటి వ్యాపారలు పట్ల నియంత్రణ కరువవుతోంది. ఇష్టారాజ్యంగా నీటిని తోడేసి ఎటువంటి శుద్ధి చేయకుండానే నీటి వ్యాపారాలు వాడవాడలా కొనసాగుతున్నా పర్యవేక్షించేవారు కరువయ్యారు. ప్యూరిఫైడ్, మినరల్ పేరుతో నీటిని విస్తృతంగా సరఫరా చేస్తున్న వ్యాపారులు ఆర్‌ఓ ప్లాంట్లలో కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎవరి అవసరానికి సరిపడా వారు వినియోగదారులు తాగునీటిని కొనుగోలు చేయడం, డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తిదారులు సరఫరా చేస్తుండడం వరకు బాగానే ఉన్నప్పటికీ నాణ్యత విషయంలో నియంత్రించే వారే కరువవుతున్నారు.

ఆర్‌ఓల్లో నాణ్యత కరువు...

ఇంటి అవసరాలు మొదలు శుభకార్యాల వరకు తాగునీటి కొనుగోళ్లు నగరంలో తప్పనిసరి అవుతున్నాయి. కానీ రివర్స్ ఆస్మోసిస్ (ఆర్‌ఓ) ప్లాంట్లలో తాగు నీటిని కొనుగోలు చేసి తాగేవారు సైతం అవి శుద్ధమైనవా కాదా అన్న విషయాలను పరిశీలించడం లేదు. ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న పలువురు వ్యక్తులు కాలనీలు, బస్తీలు అనే తారతమ్యం లేకుండా ఎడాపెడా ఆర్‌ఓ వాటర్ ప్లాంట్‌లను నెలకొల్పి నీటి వ్యాపారాలు చేస్తున్నారు. 20 లీటర్ల క్యాన్లలో తాగునీటిని సరఫరా చేయడమే కాకుండా.. అవే నీటిని ఒకటి, రెండు, ఐదు లీటర్ల బాటిళ్లలో నింపి డూప్లికేట్ లెబుళ్లను అతికించడం ద్వారా మార్కెట్లకు తరలిస్తున్నారు.

వాడవాడకూ వాటర్ ప్లాంట్లు...

సికింద్రాబాద్ ప్రాంతంలో మొత్తంగా 600 వరకు గృహాల్లో వెలసిన చిన్నతరహా వాటర్ ప్లాంట్లు, వంద వరకు పెద్దమొత్తంలో తాగునీటిని ఉత్పత్తి చేసే ప్లాంట్లు నడుస్తున్నాయి. భారీ ఉత్పత్తి కేంద్రాల్లో నిర్వాహకులు కొంతమేర నాణ్యతా ప్రయాణాలు పాటిస్తున్నప్పటికీ, కుటీర పరిశ్రమల్లా వెలసిన ఆర్‌ఓ వాటర్ ప్లాంట్లలో మాత్రం ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

నకిలీ బ్రాండ్లతోనూ...

బేగంబజార్ ప్రాంతం నుంచి వివిధ ప్రముఖ లేబుల్ సంస్థల పేరు కలిగిన ఖాళీ బాటిళ్లను తెప్పించుకుంటున్న వ్యాపారులు ఇక్కడ నీటిని నింపి మళ్లీ మార్కెట్‌లోని సరఫరా చేస్తున్నారు. నల్లానీటిని నింపి మార్కెట్‌లలో దుకాణాల్లో సరఫరా చేస్తున్నారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని వాటర్ ప్లాంట్‌లపై పర్యవేక్షణ ముమ్మరం చేసి, కనీస నాణ్యత ప్రాణాలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పర్యవేక్షణ శూన్యం....

సికింద్రాబాద్ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా వెలుస్తున్న తాగునీటి విక్రయకేంద్రాల తీరుతెన్నులకు జీహెచ్‌ఎంసీ హెల్త్ విభాగం అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. సికింద్రాబాద్ ప్రాంతంలో వెలసిన వందలాది వాటర్ ప్లాంట్ల తీరుతెన్నులను అధికారులు పర్యవేక్షించకపోగా, కిందిస్థాయి సిబ్బంది అందినకాడికి వసూలు చేసుకుని చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. నీటి శుద్ధత ప్రమాణాలను పర్యవేక్షకుండా ట్రేడ్ లైసెన్స్ లేదన్న సాకుతో డబ్బులు దండుకుంటున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



సుమన్ హౌసింగ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు ప్రారంభిస్తున్న భానుక నర్మద

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు ఎనిమిది వార్డుల పరిధిలోని కాలనీ, బస్తీల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు బోర్డు నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద మల్లికార్జున్ తెలిపారు. మంగళవారం నాల్గో వార్డు సుమన్ హౌసింగ్ కాలనీలో బోర్డు నిధులు రూ.12లక్షల వ్యయంతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను నర్మద కాలనీ వాసులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బోర్డు నిధులతో పాటు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సహకారంతో అన్ని కాలనీల్లో సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. కాలనీలో వీధి దీపాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు మహత్మరావు, మహేష్, రాజ్‌కుమార్, బీజేపీ నాయకులు టోపీ శంకర్, విజయానంద్. రాజ్‌మల్లేష్, వార్డు అధ్యక్షులు సచిన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు మరింత ప్రాధాన్యం



టాయిలెట్ గదులను ప్రారంభిస్తున్న గాంధీ సూపరింటెండెంట్

గాంధీఆస్పత్రి: గాంధీఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు మరింత ప్రాధాన్యమిస్తున్నట్లు సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎస్ రాజకుమారి తెలిపారు. ఆస్పత్రి ప్రధాన భవనంలోని ఇన్‌పేషెంట్ వార్డుల్లో పునర్నిర్మాణం చేసిన టాయిలెట్ గదులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ప్రాంగణంలో మురుగు వ్యవస్థ ప్రక్షాళనకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందన్నారు. ఆస్పత్రి ఐపీ బ్లాక్‌లో సుమారు 500 టాయిలెట్స్ రోగులు, రోగి సహాయకులు, సిబ్బందికి అందుబాటులోకి వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఓ యోగేశ్వర్, తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఈఈ అనిల్‌కుమార్, ఏఈ భీమన్న, జగదీష్‌ప్రసాద్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాళేశ్వరం ప్రాజెక్టుపై ఏర్పాటైన కమిషన్ విచారణకు హాజరయ్యేందుకు కేసీఆర్ బుధవారం ఉదయం బీఆర్కే భవన్‌కు వస్తారని వివరించారు. ఉదయం 10 గంటల వరకు నియోజకవర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో బీఆర్కే భవన్ వద్దకు చేరుకుని కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికి ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ యువనేత తలసాని సాయికిరణ్‌యాదవ్, పార్టీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కొలను బాల్‌రెడ్డి, పవన్ కుమార్‌గౌడ్, ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, వెంకటేషన్‌రాజు, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున్‌గౌడ్, శ్రీహరి, సురేష్‌గౌడ్, లక్ష్మీపతి, కిషోర్, ఆరీఫ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషనరీ పంపిణీ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండలిలోని రెయిన్‌బో హోంలో ఆశ్రయం పొందుతున్న బాలికలకు మంగళవారం బీసీ మహిళా సంక్షేమం సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బర్ల మణిమంజరి నేతృత్వంలో పండ్లు, స్వీట్లు, స్టేషనరీ పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకుని ఇక్కడి బాలికలకు స్టేషనరీ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు తారకేశ్వరి, గౌతమి, సంధ్య, రాణి, విజయలక్ష్మి, సరిత తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

అడ్డగుట్ట: సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను చాలా వరకు నియంత్రించవచ్చని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహడపడుతాయని పేర్కొన్నారు. బస్తీలు, కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. కాలనీ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు తమవంతు సహకారం అందించాలని కోరారు. రానున్న బోనాల పండుగ నేపథ్యంలో నిఘా మరింత ముమ్మరం చేయడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు.

బీవైఎస్ నూతన కార్యవర్గం

ఉస్మానియా యూనివర్సిటీ: భారత యాదవ సమితి (బీవైఎస్) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కమిటీ ఆతీయ అధ్యక్షుడిగా దాసరి నాగేష్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడిగా జనగామ జిల్లాకు చెందిన చెరుకూరి శేఖర్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సూర్యాపేట జిల్లాకు చెందిన బుక్కరాజు తిరుపతి యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మంచిర్యాల జిల్లాకు చెందిన అరిగెల పద్మయదవ్, లీగల్ అడ్వైజర్‌గా బట్టు మహేందర్‌యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా కోట నీలిమ



కోట నీలిమకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీనియర్ నేతలు విశాల్ సూదం తదితరులు

సనత్‌నగర్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షురాలిగా ప్రముఖ రచయిత, రాజకీయ విశ్లేషకురాలు డాక్టర్ కోట నీలిమ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఆమె టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా సేవలందిస్తూ వచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ..న్యాయం, సమానత్వం కలిగిన సమాజాన్ని నిర్మించాలనే సిద్ధాంతానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు.

పలువురు అభినందనలు..

టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా నియమితులైన కోట నీలిమను పలువురు అభినందించారు. బేగంపేటకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేతలు విశాల్ సూదం, రమేష్ తదితరులు ఆమెను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం చేసే దిశగా కోట నీలిమ కీలక పాత్ర పోషించగలరని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌ను కూడా కలిసి వారు అభినందనలు తెలిపారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాన శిబిరంలో పాల్గొన్న జనరల్ సర్జరీ వైద్యులు, విద్యార్థులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి జనరల్ సర్జరీ విభాగం, అసోషియేషన్ ఆఫ్ సర్జన్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) తెలంగాణ చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గాంధీ బ్లడ్‌బ్యాంకులో స్వచ్ఛంధ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు సర్జన్స్ వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించిందని గాంధీ జనరల్ సర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ రాజారామ్ తెలిపారు. సర్జన్లు కేవలం ఆపరేషన్ థియేటర్‌కే పరిమితం కాకుండా, సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్జికల్ రిజిస్ట్రార్ సంతోష్‌బాబు, ప్రొఫెసర్లు శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, ఏఎస్ఐ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ జగదీశ్వర్‌గౌడ్, రాజు, ఆర్‌ఎంఓలు కళ్యాణచక్రవర్తి, రజనీ, నవీన్, నాజమ్, మీనాక్షీ, యోగేందర్, వైద్యులు, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించండి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు కల్పించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ నాగేశ్వర్ రావు మంగళవారం డిమాండ్ చేశారు. పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీల వరకు బోధన, బోధనేతర ఉద్యోగాలను భర్తీ చేయాలని, పాత భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలని, మరుగు దొడ్లు, తాగునీరు, క్రీడా మైదానాలు తదితర సౌకర్యాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇదిలా ఉండగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల్లో పాఠ్యాపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ సకాలంలో అందించాలని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని జార్జిరెడ్డి గ్రేటర్ హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అంజి, సహాయ కార్యదర్శి రుక్మత్ పాషా, కోశాధికారి ధనుష్, జాల్లి నాయకులు సాగర్, కార్తీక్, పాండు తదితరులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.

విద్యార్థుల బస్‌పాస్ చార్జీల పెంపుపై ఆగ్రహం

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల బస్‌పాస్ చార్జీలను 20 శాతం పెంచడంపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్జీల పెంపుతో విద్యార్థులపై ప్రతి నెలా రూ.250 నుంచి రూ.350 వరకు భారం పడుతుందన్నారు. ఓట్ల కోసం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ భారాన్ని విద్యార్థుల వేయడం దారుణమన్నారు. పెంచిన చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో బస్సు భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రకటన పంపించి బురిడీ కొట్టించి..

రూ.1,26,700లను కాజేసిన సైబర్ నేరగాళ్లు

సనత్‌నగర్: రోజుకు రూ.50 నుంచి రూ.3,000 వరకు సంపాదించవచ్చనే ప్రకటనను చూసిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు బురిడీ కొట్టించారు. ఈ సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్ డీఎస్ ఎంకాలనీకి చెందిన మహమ్మద్ గౌస్ ఫోన్ వాట్సప్‌కు పార్ట్ టైమ్, ఫుల్ టైమ్ ఉద్యోగం గురించి మెసేజ్ వచ్చింది. రోజుకు రూ.50 నుంచి రూ.3,000 వరకు సంపాదించవచ్చనేది ఆ మెసేజ్ సారాంశం. దీంతో ఆకర్షితుడైన గౌస్ లింక్‌పై క్లిక్ చేయగా వారు టెలిగ్రామ్ గ్రూపునకు మళ్లించారు. ఆ తర్వాత వారు గౌస్‌కు ఒక టాస్క్ ఇవ్వగా దానిని పూర్తి చేయగా కొంత డబ్బు పంపించారు. దీంతో వారిపై అతనికి నమ్మకం కలిగింది. ఈ క్రమంలో కొంత పెట్టుబడి పెడితే 50 శాతం లాభం పొందవచ్చని సైబర్ నేరగాళ్లు చెప్పగా దీనిని నమ్మి రూ.1,26,700 పంపించాడు. ఆ తర్వాత నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయానని గ్రహించి సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హుస్సేన్ సాగర్‌లో దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: హుస్సేన్ సాగర్‌లో దూకి ఓ గుర్తు తెలియని వ్యక్తి(55) ఆత్మహత్య చేసికున్నాడు. ఈ ఘటన లేక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మంగళవారం అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్ బండ్‌పై లవ్ హైదరాబాద్ ప్రాంతంలో హుస్సేన్ సాగర్‌లోకి దూకాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి గాలించి అతన్ని బయటకు తీశారు. 108 సిబ్బంది అక్కడకు చేరుకుని గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

మైసిగండిలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



సికింద్రాబాద్: మైసిగండి మైసమ్మ దేవాలయంలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. బౌద్ధనగర్ కార్పొరేటర్ శైలజ, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు సుంకు రాంచందర్, వెంకటేష్, రాంబాబు ముదిరాజ్‌తో పాటు పెద్ద సంఖ్యలోని కార్యకర్తలు అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్ పద్మావతి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి 4వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఈనెల 12 నుంచి 15వ తేదీ వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అమరం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం సాయంత్రం 6 గంటలకు భగవత్ ప్రార్థన, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విక్వరణం, మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ, వైనతేయాధివాసాలు, నివేదన తీర్థ ప్రసాద వితరణ ఉంటుంది. 15న సాయంత్రం 5.30 గంటలకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, ధ్వజారోహణం, ద్వాదశారాధన, మంత్రపుష్పం, ఏకాంతసేవ జరుగుతాయని వివరించారు.

నిర్లక్ష్యపు డ్రైవింగ్ పనికిరాదు

నార్త్‌జోన్ ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి



జేబీఎస్‌లో ఆర్టీసీ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రసూల్‌పురా: ఆర్టీసీ డ్రైవరక్లు నిర్లక్ష్యపు డ్రైవింగ్ ఎప్పుడూ పనికిరాదని.. అలా నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. జేబీఎస్‌లో డ్రైవర్లకు మంగళవారం బేగంపేట టీటీఐ ఇన్‌స్పెక్టర్ నాగుల అశోక్ ఆధ్వర్యంలో 'రోడ్డు ప్రమాదాలు - నివారణ' అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ... ఆర్టీసీ బస్సుల్లో ప్రతి రోజు 54 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలంటే అది డ్రైవర్ల చేతిలోనే ఉంటుందన్నారు. అందుకే డ్రైవర్లు బాధ్యతగా వాహనాలను నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపొద్దని అందరు తప్పనిసరిగా జీవిత బీమా చేసుకోవాలని సూచించారు.

◆ **ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ చేతిలో..**

టీటీఐ బేగంపేట ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... బస్సులో ప్రయాణం అంటేనే సురక్షిత ప్రయాణమని ఒక బస్సులో 50 మంది ప్రయాణికుల ప్రాణాలు డ్రైవర్ చేతిలో ఉంటాయని అన్నారు. బస్సు డ్రైవర్ జాగ్రత్తగా నడిపి ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు.

◆ **'అతివేగం అంతిమ ప్రయాణం అవుతుంది'**

గోపాలపురం ట్రాఫిక్ సీఐ భాస్కర్ మాట్లాడుతూ.. అతివేగం అంతిమ ప్రయాణం అవుతుందన్నారు. సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ ఆర్‌ఎంవో అపర్ణ కళ్యాణి, జీఎస్.పవిత్ర, డీఎం సుధాకర్, టీటీఐ సిబ్బంది అయాన్, కృష్ణ పాల్గొన్నారు.